
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025 | 5







పెందుర్తితో చర్చిస్తున్న 'తూర్పు' కలెక్టర్ కీర్తి చేకూరి

రేపు సీఎం చంద్రబాబు
నల్లజర్ల రాక

- 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లు పరిశీలించిన 'తూర్పు' కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే వెంకట్రాజు, సమన్వయకర్త పెందుర్తి

రాజమహేంద్రవరం/నల్లజర్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 3వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో కలసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ బుధవారం సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చకచకాచేయాలని, పర్యటన విజయవంతం చేయాలన్నారు. ప్రొటోకాల్, భద్రత, సభా ప్రాంగణం, ప్రజా వేదిక, హెలిప్యాడ్, రవాణా అండ్ పార్కింగ్, స్టాల్స్, రైతులతో సీఎం ముఖాముఖి వంటి ఏర్పాట్లపై విభాగాల వారీగా సూచనలు చేశారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, ముఖ్యంగా రైతుల కోసం వస్తున్నారని, అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా నల్లజర్ల బైపాస్ సమీపంలో ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సెట్స్ వద్ద సభ స్థలాన్ని ఏర్పాటుచేశారు. ఉద్యాన పంట అయిన ఆయిల్ పాం గెలల కోత, గిట్టుబాటు ధరలపై స్థానిక రైతులతో సీఎం మాట్లాడతారు. అలాగే వరి రైతులు, కూరగాయల రైతులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం పది గంటలకు చంద్రబాబు చేరుకుంటారని సమాచారం. ఈ కార్యక్రమం తర్వాత కేడర్‌తోనూ భేటీ ఉంటుంది.



రబీకి రెడీనా..

వ్యవసాయ సీజన్.. మారుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎప్పుడు నారుమళ్లు వేయాలి, ఎప్పుడు ఊడ్పులు చేయాలి, పంట చేతికొచ్చేది, మాసూళ్లు ఎప్పుడు పూర్తవుతాయో ఒక లెక్క ఉండేది. వాతావరణ మార్పులు, తుఫాన్ల దెబ్బకు ఈ సీజన్‌లు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ నెలాఖరుకి రబీకి నాట్లు పడాలి. కానీ వరి కోతలు ఇంకా సాగుతున్నాయి. పది రోజుల దాకా కొనసాగే పరిస్థితి ఉంది. మరి రబీ నాట్లు ఎప్పుడు పూర్తవుతాయి. కచ్చితంగా ఆలస్యమవుతాయని చెప్పొచ్చు.

- పూర్తికాని ఖరీఫ్ మాసూళ్లు
- 31లోపు రబీ నాట్లు పూర్తంటే ఎలా
- తూర్పు డెల్టాకు నీరు విడుదల
- సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు ఎప్పుడో
- ఖరీఫ్ రైతును వెంటాడుతున్న వానలు
- ఈనెల 15వ తేదీలోపు ఖరీఫ్ ఒబ్బిడి
- ఇప్పటికే 2 లక్షల 10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో 8.96,507 ఎకరాల్లో రబీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని మూడు డెల్టాల పరిధిలోని వరిసాగు ఒక పద్ధతిలో సాగడంలేదు. పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకూడదంటే ముందుగానే పంట సాగు మొదలుపెట్టాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. గతంలో మే నెలలోనే నారుమళ్లకు సిద్ధం చేసుకుని, జూన్ నెలలో నాట్లు మొదలు పెట్టేవారు. కొన్నేళ్ల నుంచి ఈ క్రమం తప్పింది. బాగా ఆలస్యం అవుతోంది. డిసెంబరు నెల వచ్చేసినా వరి కోతలు ఇంకా పూర్తికాలేదు. తూర్పుగోదావరి జిల్లాలో మూడు వంతులకుపైగా జరిగినా, మిగతా జిల్లాల్లో వరి మాసూళ్లు పూర్తికాలేదు. ఈ పరిస్థితుల్లో రైతుల ధాన్యం ఇంకా కొంత వరకూ కళ్లాలలోనూ, రోడ్లమీద ఆరబోతలోనూ, రాశులుగానూ ఉంది. దిత్వా తుఫాన్ వల్ల ప్రస్తుతం కోతలు ఆపేసినా, ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో చాలావరకూ ధాన్యం కొనుగోలు జరుగుతోంది. సోమవారం నాటికి జిల్లాలో 29,164 మంది రైతుల నుంచి 2,21,036 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 20,225 మంది రైతులకు రూ.340.70 కోట్లు జమచేశారు. ఇది మంచి పరిణామమే. కానీ రబీ సాగు విషయంలో ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల్లో సోమవారం నుంచే రబీ ప్రారంభమైనట్టు చెబుతూ, ఈనెలాఖరు నాటికి నాట్లు కచ్చితంగా పూర్తి కావాలని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. సంక్రాంతి తర్వాత వరకూ కూడా రబీ సాగు కొనసాగే పరిస్థితి ఉంది. ఇక ఫిబ్రవరి 1 నుంచి సాగునీటిని వంతుల వారీగా అమలుచేయడానికి నిర్ణయించారు. వచ్చే ఏడాది మార్చి 31కి రబీ సాగు పూర్తి చేయాలనేది నిర్ణయం.



బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు

• 93.26 టీఎంసీల నీరు అవసరం

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే నీటితో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ, డెల్టాలకు సంబంధించి ఈ రబీలో 8,96,507 ఎకరాల్లో వరిపంట సాగుచేయనున్నారు. అందులో తూర్పుడెల్టా, పీబీసీ పరిధిలో 2,64,507 ఎకరాలు, గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో 1,72,000 ఎకరాలు, పశ్చిమ డెల్టా పరిధిలో 4,60,000 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంటుంది. దీనికోసం 93.26 టీఎంసీల సాగునీరు అవసరం. అయితే అంతనీరూ అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. మార్చి 31వ తేదీకి పూర్తవ్వాలని అధికారులు చెబుతున్నా, ఇతర ప్రాంతాల వారు మాత్రం ఏప్రిల్ 15వ తేదీ వరకూ నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

• తూర్పు డెల్టాకు నీరు విడుదల

రబీసాగు కోసం తూర్పు డెల్టాకు సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేశారు. కానీ ఇంకా సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయలేదు. సోమవారం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు సమక్షంలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ శ్రీనివాస్, డిఈరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలోని సుబ్బారావుపేటలో సోమవారం వృద్ధాప్య పింఛను అందజేస్తున్న సందర్భంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

జిల్లాలో 93.89% పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం ఉదయం నుంచే మొదలుపెట్టారు. దాదాపు 4 వేల మంది సచివాలయ తదితర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. దీంతో ఉదయం పది గంటల సమయానికే 80 శాతం పంపిణీ పూర్తయింది. సాయంత్రం ఎనిమిది గంటలకు 93.89 శాతం పూర్తి చేశారు. మొత్తం 2,34,520 మంది లబ్ధిదారులకు రూ.102 కోట్ల 70 లక్షల 42వేల 500 అందజేయాల్సి ఉండగా.. తొలి రోజున 2,20,181 మందికి రూ.96 కోట్ల 12 లక్షల 91వేల 500 అందజేశారు. ఈనెల పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరంఅర్బన్, గోపాలపురం, నిడదవోలు ఉన్నాయి. కాగా బయోమెట్రిక్ లేదా

ఉదయం పదికే 80 శాతం పూర్తి

ఐరిష్ గుర్తింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా పెన్షన్ పంపిణీ అధికారులు బయోమెట్రిక్ నిర్ధారణ ద్వారా డబ్బులు అందజేస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పింఛను అందలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, చివరి లబ్ధిదారు వరకూ పింఛను కచ్చితంగా అందుతుందని చెప్పారు. కాగా రాజమహేంద్రవరం నగరంలోని గాంధీపురం-1లోని సుబ్బారావుపేటకు చెందిన నామాల రమాయమ్మ(78) ఇంటికి కలెక్టర్ వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఆర్ఎంసీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.





రాజమహేంద్రవరంలో ఎయిడ్స్‌డే అవగాహన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి.. ర్యాలీలో విద్యార్థినులు

హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు

- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- రాజమహేంద్రవరంలో ప్రపంచ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, వారితో ఆప్యాయంగా గౌరవంతో వ్యవహరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. డిసెంబరు 1 ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాల వరకూ నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ టెస్టింగ్ సంఖ్యను గణనీయంగా పెంచామని, తొలి దశలోనే పరీక్షలు చేయించుకుంటే వైరస్ వ్యాప్తిని నివారించడం పూర్తిగా సాధ్యమవుతుందని అన్నారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్ఐవీ టెస్టులు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, గర్భిణీల నుంచి శిశువులకు వ్యాధి సోకకుండా నిరోధించడంలో గణనీయమైన పురోగతి సాధించామని, పాజిటివ్ శిశువుల కేసులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ జువైనల్ హోంలలో ఎక్కువ మంది సింగిల్ పేరెంట్ చిల్డ్రన్ ఉండడం ఆందోళనకరమని అన్నారు. పిల్లల్లో నేర ప్రవృత్తిని తల్లిదండ్రులు ముందుగానే గుర్తించి వారిని సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ సందర్భంగా రెడ్ బెలూన్లను ఎగుర వేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, దిశ సంస్థ క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన రంగోలీ, పోస్టర్ ప్రదర్శన, రీల్స్ మేకింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా హెచ్ఐవీ పాజిటివ్ బాధిత పిల్లలకు, పెద్దలకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు.





కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరిస్తున్న జేసీ మేఘాస్వరూప్.. జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కిషోర్

ప్రతి అర్జీ నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలి!

- జేసీ మేఘాస్వరూప్
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీ నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 178 అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో రెవెన్యూ శాఖకు 87, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు 39, పోలీసు శాఖకు 12, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్ మాట్లాడుతూ అధికారులు పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. వచ్చిన ప్రతీ అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని ఆదేశించారు.

ఎస్పీకి 33 ఫిర్యాదులు అందజేత

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి 33 అర్జీలను స్వీకరించారు. త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



సెల్ఫీ తీసుస్తున్న డింపుల్, ఆషిక

హీరోయిన్ల సందడి

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో విడుదల కాబోతున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంలోని బెల్లబెల్ల పాటను చిత్ర బృందం సోమవారం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఆ సినిమా దర్శకుడు కిషోర్ తిరుమల, హీరోయిన్ ఆషిక రంగనాథ్, మరో హీరోయిన్ డింపుల్ హయాతి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి హీరోయిన్లు డాన్స్ చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జీజీయూ వైస్‌చాన్సలర్ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సాయుధ దళాల ఫ్లాగ్ డేకి విరాళం అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

సాయుధ దళాల ఫ్లాగ్‌డేకి స్వచ్ఛందంగా విరాళాలు అందించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న సాయుధ దళాల ఫ్లాగ్ డే సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారికి కలెక్టర్ స్వయంగా తన విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది విరాళాల సేకరణలో డ్వాక్రా మహిళలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా అలాగే సహకరించాలన్నారు. ఈ నిధులను అమరవీరుల కుటుంబాలు, వికలాంగులైన సైనికులు, రెండో ప్రపంచ యుద్ధ సైనికులు, వితంతువులు, మాజీ సైనికుల సంక్షేమానికి వినియోగిస్తారని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జడ్పీ బ్యాంచ్, కాకినాడ, ఖాతా నెం.62064060623, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఎస్‌బీఐఎన్0020974 పేరిట డిమాండ్ డ్రాఫ్టు/చెక్కు రూపంలో అందజేయవచ్చని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్కే నవాబ్ జాన్ సాహెబ్ తెలిపారు. ఈ ఏడాది డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలు జెండా దినోత్సవ నిధికి రూ.10 చొప్పున విరాళం అందించారని కలెక్టర్ గుర్తుచేశారు. దీంతో ఆ నిధి సేకరణలో జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పుడు కూడా అదే చొరవ చూపాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్ఈడీ సీఈవో జగపతి

డ్వాక్రా మహిళలు జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలి

మహిళలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయ సంఘాల మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని జడ్ఈడీ సీఈవో జగపతి ఆకాంక్షించారు. చిన్న పరిశ్రమల స్థాపనలో భాగంగా మండలంలోని మహిళా వ్యాపారవేత్తలకు రాజానగరంలోని సెర్ప్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్న పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు బ్యాంకు రుణాలు మంజూరుతో పాటు జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ సర్టిఫికెట్ అందిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా వ్యాపారవేత్తలుగా రాణించి, కుటుంబ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో కోఆర్డినేటర్ హేమంత్, సెర్ప్ ఏపీఎం సునీత, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్ల చోరీ
నలుగురి అరెస్ట్.. రూ.2 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

70 శాతం ఆన్‌లైన్.. 7
అన్నవరం సత్రం గదుల్లో 70 శాతం ఆన్‌లైన్ ద్వారా కేటాయింపు



కాకినాడ జిల్లా పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

'దశ' మారేలా!

పదో తరగతి పరీక్షలకు విద్యా శాఖ విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 16 నుంచి జరగనున్న పరీక్షలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయగా, ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికను ఈ నెల ఆరో తేదీ నుంచి అమలు చేయనున్నారు. దీనిని పక్కాగా చేపట్టాలని ఎంఈవోలు, డీవైఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఈ పదునైన ప్రణాళిక ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 29,866 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

- పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ
- వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసిన కాకినాడ జిల్లా విద్యా శాఖ
- సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్
- హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యత
- స్లో లెర్నర్స్ కోసం స్టడీ మెటీరియల్ అందజేత



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా వెనుకబడుతోంది. గత ఏడాది విడుదలైన ఫలితాల్లో 15వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు రెండు, మూడు స్థానాల్లో ఉండే ఫలితాలు దిగజారిపోవడం ఆందోళన కలిగించే అంశం. అయితే ఈ సారి ఆ పరిస్థితి లేకుండా టాప్-5లో ఉండేలా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఈ నెల నుంచి వంద రోజుల కార్యచరణ అమలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఇప్పటికే ఆదేశించారు. ప్రతి విద్యార్థినీ సంబంధిత ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారి అభ్యసన స్థాయిని నిరంతరం పరిశీలించాలని కోరారు. ఏదైనా సబ్జెక్టులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు నిత్యం పాఠశాలలను సందర్శించి, బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై సూచనలు జారీ చేస్తున్నారు. స్లో లెర్నర్స్ కోసం ఇప్పటికే స్టడీ మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు అందించారు.

'పది' ఫలితాలకు పదునైన సూత్రాలు..

- జిల్లావ్యాప్తంగా ఏటా ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న పాఠశాలల్లో బోధనను విద్యాశాఖాధికారులు నిత్యం పర్యవేక్షించేలా, ప్రతిరోజూ పాఠశాలను సందర్శించేలా ఆదేశాలిచ్చారు.
- విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి బోధన తీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.
- కష్టమైన గణితం, ఇంగ్లిష్, సైన్స్ బోధన ఎలా సాగుతోందో పక్కాగా పరిశీలించాలి.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం పునశ్చరణ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు



కాకినాడ జిల్లా గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో రమేష్

- ఆయా పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పరీక్షల్లో తప్పకుండా వస్తాయని భావించే ప్రశ్నలను విద్యార్థులకు బోధించాలి.
- పరీక్షల్లో తప్పకుండా ఇస్తారని భావించే ప్రశ్నలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని రాసేలా మెరుగైన శిక్షణ ఇవ్వాలి.
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారు ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి.
- పరీక్షల్లో తప్పక వస్తాయని భావించే ప్రశ్నలను ప్రతిరోజూ విద్యార్థులతో చూడకుండా రాయించాలి. హోం వర్క్ ఇవ్వాలి.
- ఉపాధ్యాయులు ప్రతివారం విద్యార్థుల సామర్థ్యానికి సంబంధించిన నివేదికను రూపొందించి వారికి ఇవ్వాలి.
- బాగా వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని శిక్షణ ఇవ్వాలి. ప్రతి వారం విద్యార్థులు ఎన్ని మార్కులు సాధిస్తారనే విషయంపై పాఠశాల హెచ్ఎం నివేదిక రూపొందించాలి.
- బొమ్మలు గీయడం, మ్యాప్ పాయింటింగ్, గ్రాఫ్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షలకు సమాయత్తం చేయాలి.

గత కొన్నేళ్లుగా ఫలితాలు ఇలా...

సంవత్సరం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2021-22	66,175	46,579	65.83
2022-23	27,358	18,608	68.02
2023-24	27,671	22,993	83.09
2024-25	27,368	22,508	82.24



మహా సంస్థానంలో దత్తాత్రేయ స్వామికి తులసి అర్చన

మహా సంస్థానంలో వైభవంగా లక్ష తులసి అర్చన



పాదగయ క్షేత్రంలో పుష్పాలంకరణలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో రుత్వికులు తులసిదళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, రుత్వికులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. ఈవో అర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూవుగా వెలసిన దత్తాత్రేయస్వామికి సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. పండితులు వేదమంత్రోచ్చారణలతో అర్చన జరిపించి దత్తాత్రేయ స్వామిని అలంకరించారు. మహాగణపతి పూజ, కలశ స్థాపన, రుత్విక్‌వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న రుత్వికులు



మూఢం

శుభ కార్యాలకు విరామం

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలలు ముహూర్తాలు లేవు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. మార్గశిర శుద్ధ షష్ఠి (నవంబరు 26)న ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య (ఫిబ్రవరి 17) వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభ ముహూర్తాలు లేవు.

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభ కార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా పుష్య మాసం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలో ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతీదేవి జన్మదినమైన వసంతపంచమి, మహా మాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి... ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే...

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగైపోవడమే మౌఢ్యమి. వాడుక భాషలో మూఢమి అంటే చీకటి. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు కూడా అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవ్వడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెప్తున్నారు. అందుకే శుక్ర మౌఢ్యమి ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదంటారు.

వ్యాపారులపై ప్రభావం...

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్ హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళాలు... ఇలా సంబంధిత వర్గాల వారు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

శుభ కార్యాలు చేయకూడదు



వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలలు శుభ కార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యమి వల్ల ఒక్క ముహూర్తం కూడా ఉండదు. గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

చింతా గోపీశర్మ సిద్ధాంతి
పెద్దాపురం, కాకినాడ జిల్లా

డొంకరాయి నుంచి వాటర్ కట్

రెండు నెలలపాటు నీరు నిలుపుదల
ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు



డొంకరాయి పవర్ కెనాల్, జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి నీటి విడుదలను రెండు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు తెలిపారు.ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 115 మెగావాట్ల సామర్థ్యం (ఒక్కొక్కటి) గల 5, 6 యూనిట్లకు కమీష నింగ్ పనుల్లో భాగంగా ఫోర్‌బే డ్యాం నుంచి పెన్‌స్టాక్ పైపులైన్ ద్వారా నీరు పంపడానికి అవసరమైన వాటర్ కండక్టర్ సిస్టంను ఫోర్‌బే ఇంటెక్ వద్ద ఏర్పాటు చేయాలని, ఈ పనులు చేయాలంటే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి వచ్చే నీటి విడుదలను పూర్తిగా నిలిపి వేయాలని సీఈ తెలిపారు. దీని కోసం డిసెంబరు 2 నుంచి రెండు నెలల పాటు ఏపీ జెనోకో గ్రిడ్ ఉన్నతాధికార్ల నుంచి ఎల్‌సీ అనుమతులు తీసు కున్నామని ఆయన తెలిపారు. ఈ రెండు నెలలు పాటు పొల్లురు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఈ షట్‌డౌన్ సమయంలో పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్లకు కొన్ని ఆపరేషన్ మెంటెనెన్సు పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. అలాగే డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవరాలింగ్ పనులను నిర్వహించనున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో 2నెలలు పాటు విద్యుత్ డిమాండ్ మేరకు గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు తెలిపారు.

డాక్టర్ మంజూషకు టైమ్స్ గ్రూప్ పురస్కారం

సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



నటుడు అనుపమ్‌ఖేర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మంజూష

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ సలాది మంజూషకు ప్రతిష్టాత్మకమైన టైమ్స్ గ్రూప్ పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి సంబంధించి టైమ్స్ ఎక్సలెన్స్ హెల్త్ 6వ ఎడిషన్‌లో సర్వీస్ ఎక్సలెన్స్ ఇన్ గైనకాలజీ అండ్ ఉమెన్స్ హెల్త్ కేర్‌లో ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంజూషకు ఈ అవార్డును ప్రముఖ హిందీ నటుడు అనుపమ్‌ఖేర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

స్కౌట్ జంబోరీలో శ్రీహర్షకు నేషనల్ అవార్డు

తాళ్లపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీహర్ష లక్నోలో జరిగిన భారత స్కౌట్ అండ్ జంబోరీలో నేషనల్ కాంపిటీషన్‌కు హాజరై అవార్డు సాధించాడు. శ్రీహర్ష న్యూ ఆరుగొలను బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా ఈ పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులకు అవార్డులు రావడంతో పలువురు గ్రామస్థులు వారికి అభినందనలు తెలిపారు.

జాతీయ ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక

- నెలాఖరున రాజస్థాన్‌లో పోటీలు
- ఏపీ నుంచి 2 జట్లు పాల్గొంటాయి
- ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

లంకెలపాలెం (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, బాలికల జాతీయ స్థాయి ఖోఖో జట్లను అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జె.హర్షవర్ధన్ (విశాఖపట్నం), జి.మనోహర్ నాయుడు (విశాఖపట్నం), టి.సూర్యనారాయణ (చిత్తూరు), ఎస్.బద్రీనాథ్ (చిత్తూరు), టి.శృతిసాయి కీర్తన్ (విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్ (గుంటూరు), సి.నగేష్ (కర్నూలు), కె.వెంకటసాయి (ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి (తూర్పుగోదావరి), బి.కార్తీక్ (శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్ (కడప), కె.చరణ్ (విశాఖపట్నం) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

ఆర్.శృతిక (విశాఖపట్నం), ఆర్.లలితాదేవి (విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ (చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి (చిత్తూరు), జి.చందన (శ్రీకాకుళం), కె.పావని (విజయనగరం), టి.సింధు (ప్రకాశం), ఎన్.బంధవిక (కృష్ణా), జి.అనుపమ (కడప), ఆర్.వీణ (అనంతపురం), టి.ప్రియ (తూర్పుగోదావరి) ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు.



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే పంతం నానాజీ.. కాకినాడలో అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారం కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్-11, 14, 17, 19 క్యాటగిరిల్లో టోర్నమెంట్ కం సెలెక్షన్ నిర్వహించారు. దీనికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, అడ్మిన్ సెక్రటరీ కె.శ్రీనివాస్, డీఈవో పి.రమేష్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, ఆర్ఐపీఈ జాన్సన్, డీవైఈవో సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 450 పిల్లలు పాల్గొన్నారు. 50 మంది పీడీలు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజ్, లంక జార్జ్, పరశురాము, నూరిబాబు, సురేష్ రాజు పాల్గొన్నారు.



వినూత్న ఆవిష్కరణలపై జేఎన్టీయూలో ఎఫ్‌డీపీ



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్, ఐఎస్‌టీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించే సదస్సుకు ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఐఎస్టీ డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును సోమవారం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ పరిశోధన, శాస్త్ర సంబంధ అంతర విభాగ రంగాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ బీకే సాహు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ టీబీ వ్యాక్సిన్ ఆవిష్కరణను తెలిపారు.ప్రొఫెసర్ రవికుమార్ ఔషధ పంపిణీ వ్యవస్థల గుణాలు, చెడు ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దేవరపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూతాపల్లి రామారావు దంపతులు పీటలపై కూర్చోగా ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు ఈ కల్యాణోత్సవాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఐవీఆర్ఎస్ సర్వేలో
‘అన్నవరం’ ఆరో స్థానం

కొనసాగుతున్న భక్తుల అసంతృప్తి

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానాలయాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి భక్తుల నుంచి అసంతృప్తి శాతం కొనసాగుతుంది. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలో అన్నవరం దేవస్థానం 69.7 శాతంతో ఆరోస్థానంలో నిలిచింది. 73.8 శాతంలో ద్వారకా తిరుమల మొదటిస్థానంలో ఉండగా 67.9 శాతంతో విజయవాడ చివరిస్థానంలో నిలిచింది. అన్నవరం ప్రసాదం నాణ్యత, రుచి విషయంలో 77.6 శాతం బాగుందని తెలిపారు. ఈ విషయంలో అన్నవరం దేవస్థానం 5వ స్థానం, శానిటేషన్ నిర్వహణలో 64.2 శాతం మంది బాగుందని చెప్పడంతో ఆరోస్థానంలో ఉంది. ఏడు ప్రధాన దేవాలయాల్లో అక్టోబరు 25 నుంచి నవంబరు 25 వరకు చేపట్టిన సర్వేలో ఈ గణాంకాలను విడుదల చేశారు. దర్శనం సంతృప్తిగా జరగడం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పన, ప్రసాదం రుచి, నాణ్యత, పారిశుధ్యంపై ప్రతినెలా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తుంది.

సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు
3,200 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి



సామర్లకోటలో దిగుమతి అవుతున్న ధాన్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు కృష్ణా జిల్లా గుడివాడ నుంచి ప్రత్యేకంగా రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం రెండు రోజులుగా దిగుమతి అయ్యింది. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక ప్రముఖ రైస్‌మిల్లు ఈ ధాన్యాన్ని దిగుమతులు చేసుకున్నట్టు రైల్వే పార్సిల్ వర్గాల ద్వారా తెలిసింది. పొరుగు రాష్ట్రాలైన బీహార్, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు ధాన్యం దిగుమతులు కావడం సహజంగా వస్తున్నప్పటికీ మొట్టమొదటిసారిగా కృష్ణా జిల్లా గుడివాడ నుంచి రెండు రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుమతులు కావడం విశేషం. ధాన్యం దిగుమతుల కోసం రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.28 లక్షల ఆదాయం సమకూరింది. దీంతో సామర్లకోటకు చెందిన 100 లారీలకు దిగుమతులు, ఎగుమతుల ద్వారా సుమారు రూ.5 లక్షల మేర రవాణా చార్జీలగానూ, 150 మంది కూలీలకు మరో రూ.5 లక్షలమేర హమాలీ జట్టు కూలీలకు ఉపాధి లభించినట్లైంది.

70 శాతం ఆన్‌లైన్..

- అన్నవరం దేవస్థానం సత్రం గదుల్లో 70 శాతం ఆన్‌లైన్ ద్వారా కేటాయింపు
- పర్వదినాలు, వివాహాల సమయంలో సిఫార్సు లేఖలకు స్వస్తి
- పెరిగిన సత్రం గదుల అద్దె రేట్లు అమలు



రత్నగిరిపై సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగదుల్లో 70శాతం గదులను ఆన్‌లైన్‌లో ఉంచాలనే దేవదాయశాఖ ఆదేశాలను సోమవారం నుంచి అధికారులు ఆచరణలో పెట్టారు. దేవస్థానంలో సుమారు 470 గదులు అందుబాటులో ఉండగా వీటిలో 70 శాతం గదులు అంటే సుమారు 330 గదులను భక్తులు ఆన్‌లైన్ ద్వారానే బుకింగ్ చేసుకోవచ్చు. మిగిలిన 30శాతం గదులు వివాహాలకు దేవస్థానం అడ్వాన్స్ రిజర్వేషన్ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో భక్తులు క్యూలైన్‌లలో ఉండి పడిగాపులు పడాల్సిన అవసరం ఉండదని దేవదాయశాఖ ఆలోచనగా తెలుస్తుంది. మరోపక్క పర్వదినాల్లో గదులు దళారులు చెంత కు వెళ్తున్నాయనే ఆరోపణలకు చెక్ పడనుంది. ఒక మెయిల్ ఐడీతో కేవలం 2గదులు మాత్రమే ఆన్‌లైన్‌లో బుక్ అయ్యేవిధంగా తిరిగి ఆ మెయిల్ ఐడీ ద్వారా 2 నెలల పాటు బుకింగ్ చేసుకోవడానికి వీలులేకుండా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. ఇదిలా ఉండగా వివాహాల సమయంలో, కార్తీకమాసం వంటి పర్వదినాల్లో సిఫార్సు లేఖలు కుప్పలుతెప్పలుగా వచ్చిపడి దేవస్థానం అధికారులకు శిరోభారంగా మారుతుంది. ఆన్‌లైన్ విధానంతో సిఫారస్‌లేఖలకు కత్తెరపడనుంది. మరోపక్క సత్రంగదులకు పెంచిన అద్దె ధరలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ప్రకాష్‌సదన్ అద్దె జీఎస్టీతో కలిపి రూ.1260, న్యూ, ఓల్డ్ సెంటినరీ గదులు రూ.700, హరిహరసదన్ నాన్‌ఏసి రూ.800, ఏసీ గదులు జీఎస్టీతో కలిపి రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. శివసదన్ కాటేజీ అద్దెలను యథాతథంగా ఉంచారు.

అన్నవరం దేవస్థానానికి
పెంకుటిల్లు విరాళం



ఇంటిపత్రాలు ఈవోకు అందజేస్తున్న దాత

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన ఒకదాత అన్నవరం దేవస్థానానికి ప్రభుత్వ విలువ రూ.3.82 లక్షలు, మార్కెట్ విలువ రూ.40 లక్షల విలువైన 98.51 చదరపు గజాల పెంకుటిల్లును విరాళంగా అందజేశారు. లింగంపల్లి వెంకట సూర్య సత్యనారాయణ దీనికి సంబంధించి పత్రాలను సోమవారం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం విశాఖపట్నంకు చెందిన కె.శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు



విరాళం అందజేస్తున్న దాత

ఇసుక తిప్పలో గుర్తుతెలియని మృతదేహం



పోలీసులు గుర్తించిన మృతదేహం

ఆలమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గౌతమి కొత్త బ్రిడ్జి 11-12 పిల్లర్స్‌కు మధ్యలో గోదావరి ఇసుక తిప్పలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆలమూరు పోలీసులు గుర్తించారు. అతడు బ్రిడ్జిపై నుంచి దూకేశాడా.. లేక బ్రిడ్జి కిందకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం నిర్ధారణ కావడం లేదని ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. వ్యక్తి వయస్సు 55ఏళ్లు ఉంటాయన్నారు. వివరాలు తెలిస్తే 9440904849కి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతిచెందిన శివ సూర్యనారాయణ

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇనుప ఊసలు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం కె.సూరంపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి శివ సూర్యనారాయణ (24) తాపీ పని చేస్తున్నాడు. పి.నాయకంపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీను ఇంటి డాబాపై పిట్టగోడ కట్టుకునేందుకు ఐరన్ ఊసలను మేడ పైకి తెచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటిపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు ఐరన్ ఊసలకు తగిలి విద్యుత్ షాక్‌తో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడి మేనమామ కడియం వీర సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐ.పోలవరంలో...

ఐ.పోలవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరానికి చెందిన కోడూరి వెంకటేష్(33) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వెంకటేష్ సోమవారం విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ మృతిచెందాడు. అతడిమృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్స్ దొంగిలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.2.20 లక్షల విలువైన మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం



నిందితులతో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న ఇద్దరిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ2.20 లక్షల విలువైన 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల కాకినాడ మయూరి థియేటర్ పక్క సందులో, సినిమారోడ్డులో ద్విచక్ర వాహనాలు చోరీ అవుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కెవిఎస్.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక పగడాలపేటకు చెందిన గేదెల అంజిబాబు(23), బల్లబ్బాయి రెడ్డి కాలనీకి చెందిన (19) బుద్దా వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజానగరం పోలీసులు

ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్ల చోరీ

నలుగురి అరెస్ట్

రూ.2 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్లను చోరీచేస్తున్న దొంగలు ఎట్టకేలకు రాజానగం పోలీసులకు చిక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరంలోని కొప్పిశెట్టి వీరబాబు అనే రైతు పామాయిల్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లను గతనెల 21న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా కొంతమూరు గ్రామానికి చెందిన పొడుగు వంశీ, బిక్కవోలు శివకుమార్, షేక్ మైసుద్దీన్, కోలమూరు గ్రామానికి చెందిన మాసిగిరి దుర్గయ్యను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 21 కేసులకు సంబంధించి 35 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి గురైన 120 కిలోల కాపర్ వైర్ల దిమ్మలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మురారి-గండేపల్లి మధ్యలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని జెడ్.రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. సమాచారం తెలిసివారు గండేపల్లి పోలీస్ స్టేషన్‌కి తెలియజేయలన్నారు. ఈ ఘటనపై వీఆర్వో నుంచి వివరాలు తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు.

ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం

ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కోటనందూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. సోమవారం కాకినాడ జిల్లా తుని నుంచి నర్సీపట్నం వైపు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాలలోది వరలక్ష్మితో మరువాడ గ్రామానికి చెందిన దిమిటి రాజు టిక్కెట్ చిల్లరపై విషయంపై దుర్భాషలాడి తోసేశాడు. డ్రైవర్ పీఎస్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేయగా దిమిటి రాజు కాలర్ పట్టుకుని నెట్టివేశాడు. దీంతో రేఖవానిపాలెం వద్ద దిమిటి రాజు బస్సు దిగిన తరువాత కొంతమంది వ్యక్తులతో కలసి కోటనందూరు సెంటర్ వద్ద బస్సు వద్దకు వచ్చి డ్రైవర్‌పై దాడి చేసి కాలర్ పట్టుకుని బెదిరించారు. నర్సీపట్నం బస్‌స్టాండ్ వద్ద నీ సంగతి తెలుస్తామని బెదిరించారు. డ్రైవర్ తీసిన ఫొటోల ఆధారంగా కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కండక్టర్ వరలక్ష్మీ ఫిర్యాదు చేయగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానమే పెనుభూతమై...

- గచ్చుపలకరాయితో కొట్టి భార్యను చంపి పరారైన భర్త
- ఇంద్రపాలెంలో సంఘటన
- కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు



మరణించిన బేతా మల్లేశ్వరి



భర్త గంగరాజు

కాకినాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో మద్యం మత్తులో తలపైన గచ్చుపలకరాయితో భర్త గట్టిగా కొట్టడంతో మరణించిన సంఘటన ఇంద్రపాలెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని పిల్లకాలువ రోడ్డులో గల గొల్లపేట 2వ వీధిలోని ఓ ఇంట్లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన బేతా మల్లేశ్వరి(47), గంగరాజు దంపతులు అద్దెకు ఉంటున్నారు. వారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం. కుమార్తెకు వివాహం కావడంతో స్వామినగర్‌లో వారు నివసిస్తున్నారు. కుమారుడు గణేష్ మెకానిక్‌గా పనిచేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. అయితే కొది రోజులుగా దంపతుల మధ్యగొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కూడా వారిద్దరూ ఘర్షణ పడ్డారు. మద్యంమత్తులో ఉన్న గంగరాజు భార్యపై అనుమానంతో తలపైన గచ్చుపలకరాయితో గట్టిగా కొట్టడంతో ఆమె మరణించింది. తర్వాత భర్త తన సెల్‌ఫోన్, చెప్పులు, దుస్తులను ఇంట్లోనే వదిలేసి పరారయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న తల్లిని కొడుకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సోమవారం సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించగా క్లూస్ టీమ్ పరిశీలించింది. మార్చురీలో ఉన్న మల్లీశ్వరి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరి కొడుకు గణేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులపై హెచ్‌ఎం కులవివక్ష

తల్లిదండ్రుల ఆందోళన

కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘటన



పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న ఎంఈవోలు, ఎస్ఐ

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై కులవివక్షత చూపుతూ, వారి తల్లిదండ్రులను చులకన చేసి మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడుపై చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సీఐటీయూ నాయకుడు సీహెచ్.సాంబ, ఐద్వా నాయకురాలు శీలం అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జీ.సురేష్ బోస్ విద్యార్థుల మధ్య కులవివక్షత చూపుతూ అగ్రకులాలలకు చెందిన విద్యార్థులను చులకనగా మాట్లాడుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా బాలికలకు బాలురతో లేనిపోని సంబంధాలను అంటగడుతున్నాడని వాపోయారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారులు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు, ఎస్ఐ జి.వెంకటేష్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. ఇక మీదట పాఠశాలలో విద్యార్థుల విషయంలో ఎటువంటి వివక్షత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవోలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడు కులవివక్షత చూపడం, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడనే ఆరోపణలపై విచారణ నిర్వహించి శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్టు ఎంఈవో-1 వేణు గోపాల్ తెలిపారు.



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కాకినాడ టు మైసూరు
ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-మైసూరు-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 1 సోమవారం నుంచి జనవరి 13 వరకూ నడుపనున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 1 నుంచి జనవరి 13 వరకూ ఈ ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

07033 నంబరు గల కాకినాడ-మైసూరు మధ్య జనవరి 12 వరకూ ప్రతీ సోమ , శుక్ర వారాల్లో కాకినాడలో ఉదయం 9.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూరు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 1, 5, 8, 12, 15, 19, 22, 26, 29 జనవ రి 5,9,12 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. సామర్లకోటకు ఉదయం 9.18 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి 10.08 గంటలకు, నిడదవోలుకు 10.38 గంటలకు చేరుతుంది. తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెన పల్లి, పిడుగురాళ్ళ నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగం పేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సెరం, రాయచూర్, మంత్రాలయ, ఆదోని, గుంత కల్లు, అనంతపూర్, ధర్మవరం, హిందుపూర్, యలహంక, బెంగుళూరు, కెఎస్ఆర్ బెంగుళూ రు, కొనిగెరి, మాండ్యాల మీదుగా మైసూర్‌కు మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు చేరుతుంది.

07034 నంబరు గల రైలు మైసూరు-కాకినాడ మధ్య డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకూ ప్రతీ మంగళ, శనివారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 12 ట్రిప్‌లుగా నడువనుంది. ఈ రైలు డిసెంబరు 2, 6, 9, 13, 16, 20, 23, 27, 30 జనవరి 6,10,13 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. మైసూ ర్‌లో ఈ రైలు సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 11 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుతుంది. నిడదవోలుకు రాత్రి 8.08 గంటలకు..రాజమహేంద్రవరానికి రాత్రి 8.38 గంటలకు చేరుకుని సామర్లకోటకు రాత్రి 9.18 గంటలకు చేరుకుని కాకినాడ టౌన్ స్టేషన్‌కు రాత్రి 11 గంటలకు చేరుతుంది. కాకినాడ-మైసూరు మధ్య 37 హాల్ట్‌లతో 1,391 కిలోమీటర్ల దూరాన్ని 30 గంటల పాటు ప్రయాణిస్తుంది.

ఈ వారానికి రెండు దఫాలు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్ల లో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వులలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో ఎస్ఎల్ఆర్, జీఎస్, హెచ్‌ఏ-1, ఏ1, బీ1, బీ2, బీ3, బీ4, బీ5, ఎస్1, ఎస్2, ఎస్3, ఎస్4, ఎస్5, ఎస్6, ఎస్7, ఎస్8, ఎస్9, ఎస్10, ఎస్11, జీఎస్, ఎస్ఎల్ఆర్ బోగీలు ఉంటాయి.

‘నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి’



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న రామచంద్రరావు

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్టు గురుకులాల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదె రామచంద్రరావు తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, తొలగించిన గిరిజన ఉద్యోగులను తిరిగి నియమించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, అందాల బాలురెడ్డి, బుల్లబ్బాయి తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తాళ్లరేవు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన రేకాడి మహాలక్ష్మి కోరింగలోని ఒక రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. గతనెల 29న మధ్యాహ్నం 1గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం కోరింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

యూహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

ఆసుపత్రుల చైర్మన్లతో సమావేశంలో ఎమ్మెల్యే వాసు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్(యూహెచ్‌సీ)ల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం నగరంలోని 8 యూహెచ్‌సీల చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరిచామని, రోగులు, ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల్లో సేవలు, సౌకర్యాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఓపీ కూడా బాగా పెరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. సమావేశంలో యూహెచ్‌సీల చైర్మన్లు చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, చొప్పెర్ల భద్రరావు, బుడ్డిగ గోపాలకృష్ణ, రాయుడు గణేష్, బేసరి చిన్ని, అనుసూరి వెంకట శ్రీనివాసరావు, శైలేంద్ర కుమార్ జైన్ పాల్గొన్నారు.

21న దివాన్‌చెరువులో హిందూ సమ్మేళనం

దివాన్‌చెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని విశ్వేశ్వరిమాత ఆలయ ఆవరణలో ఈ నెల 21న హిందూ సమ్మేళనం జరుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రముఖ్‌లు గ్రంధి గణేష్‌గుప్తా, కె.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ఎస్ శత వసంత వేడుకల సందర్భంగా దివాన్‌చెరువు సంఘం.. శ్రీరాంపురం, రఘునాథపురం, శ్రీకృష్ణపట్నం, పాలచర్ల గ్రామాలను కలుపుకుని ఈ హిందూ సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. వివిధ ఆలయకమిటీలు, వినాయక, దసరా ఉత్సవ కమిటీలు, భజన మండళ్ల పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని శాటిలైట్ సిటీలో ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఆరు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అలాగే ల్యాబ్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీ సుభాషిణి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణ గౌడ్, హెచ్ఎం ప్రశాంతి, ఎస్ఎంసీ చైర్మన్ గెద్దాడ కృష్ణ, వైస్ చైర్మన్ ఎలుగు బంటి దుర్గారావు, మజ్జి పద్మావతి, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎంఈవో తులసీ దాస్, చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
పలుచోట్ల సామాజిక పింఛన్ల పంపిణీ

కోరుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీలో ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. శ్రీరంగపట్నం, దోసకాయపల్లి, నిడిగట్ల గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ మంజూరు విధానంలో కీలక మార్పులు తీసుకువచ్చి లబ్ధిదారులకు పెన్షన్ అందేలా చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా మధురపూడిలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 7 నుంచి జాతర నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీతో కలిసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకట లక్ష్మి దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.


శ్రీరంగపట్నంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

బిక్కవోలు: మండలంలో నూతనంగా మంజూరైన పది వితంతు పింఛన్లను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ పందలపాకలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు లేకుండా 1వ తేదీనే సచివాలయ ఉద్యోగులతో నూరు శాతం పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పడాల వెంకట్రామారెడ్డి,సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఎంపీపీ తేతలి సుమ, సొసైటీ చైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి, నాయకులు కర్రి శ్రీనివాసరావు, గుణ్ణం శ్రీనివాసచౌదరి, తనుకు శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని పెదరాయవరం గ్రామంలో కొత్తగా మంజూరైన 3 వితంతు పింఛన్లను లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ లేకపోతే పింఛన్ల పంపిణీ జరగదని మాజీ సీఎం జగన్ అన్నారని, దానికి భిన్నంగా ఇవాళ సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకుల వారికి సహకారంతో పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 1వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు బట్వాడ చేశారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులు, లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నగరంలో 24,014 మందికి పింఛన్లను ఏమాత్రం ఆలస్యం కాకుండా పంపిణీ చేస్తోందన్నారు. కొత్తగా 38 వితంతువు పింఛన్లు, 2 డయాలసిస్ పింఛన్లు మంజూరయ్యాయరు. అలాగే 50వ వార్డులో టీ డీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్.. రవియాదవ్‌తో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక సాయికృష్ణ థియేటర్ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్ల పరిధిలో 28,001 మంది లబ్ధిదారులకు రూ.12.32 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సోమవారం సాయంత్రానికి 93.90శాతం పంపిణీ చేసినట్టు కమిషనర్ పేర్కొన్నారు.

అనపర్తి: అనపర్తి సావరంలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే పింఛన్లు పెంపుదల చేయడమే కాకుండా ప్రతీ నెల ఒకటో తేదీనే వలంటీర్ల అవసరం లేకుండా పంపిణీ చేస్తోందన్నారు. కాగా ఇటీవల బిక్కవోలు మండలంలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేరీ అనే మహిళకు స్వయంగా ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. టీడీపీ నాయకులు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని శాటిలైట్ సిటీ గ్రామంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, ప్రతి నెలా 1న పింఛన్ల పంపిణీ పూర్తిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

నివారణ ఒక్కటే మార్గం

వరల్డ్ ఎయిడ్స్ డే
పలుచోట్ల అవగాహన ర్యాలీలు



రాజానగరం పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం

రాజానగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందద్భంగా రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుంది.ఈ సందర్భంగా ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోండి-ప్రాణాలు కాపాడుకోండి, ఎయిడ్స్‌కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గం అంటూ నినదించారు. అలాగే ఎయిడ్స్‌పై లఘు నాటిక ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రామభాస్కర్, డాక్టర్ సీహెచ్ వెంకటలక్ష్మి, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ప్రసన్న, జీఎస్ఎల్ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు, ప్రిన్సిపాల్ వీఎస్ గురునాథ్, మెడికల్ సూపరింటెండ్ టీవీఎస్‌పీ మూర్తి ప్రారంభించారు. అనంతరం ఉచిత చర్మ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 500 మంది క్లాస్-4 ఉద్యోగులు, పారామెడికల్ సిబ్బందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కేపీ సీతారాం, జి.వెంకటరమణ, డాక్టర్ కవిత, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏవీకె చైతన్య ఆధ్వర్యంలో వెదుళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో ఎయిడ్‌వ్యాధి నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ జి.దైవకృప వైద్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రి న్సిపాల్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ ఎయి డ్స్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌నగర్, దానవాయిపేట ప్రాం తాల్లో జరిగిన ఈ ర్యాలీలో సుమారు 200మంది విద్యార్థినులు పాల్గొని ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎం.కన్నా, కె.వీర లక్ష్మి, దుర్గాప్రసాద్, ఠాగూర్, వైఆర్‌సీ సభ్యురాలు వీబీటీ సుందరి, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ డిపార్టుమెంట్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గైనకాలజిస్టు డాక్టర్ చందన పర్వతవర్ధిని విచ్చేసి మాట్లాడారు. సురక్షిత జీవన విధానాలు పాటించడం ద్వారా ఎయిడ్స్ లాంటి మహమ్మారి వ్యాధులను తరిమికొట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, రేడియాలజిస్టు డాక్టర్ డి.సౌమ్యశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, జి.శరత్, పీవీబీ సంజీవరావు, శివప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో రత్నంపేటలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఏఐసీసీ కార్యదర్శి, జార్ఖండ్ మాజీ ఎమ్మెల్యే అంబా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాధిని దూరం పెట్టాలి కానీ ఎయిడ్స్ బాధితులను కాదని అన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో దంటు వీర వెంకట్రావు, లక్ష్మీ ప్రవీణ, మౌనిక, శాంతి, సురేష్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో అవగాహన ర్యాలీ దృశ్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: నల్లమిల్లి


మెళ్లూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మెళ్లూరులో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం ఏర్పడినతర్వాత సీసీ రోడ్లతో పాటు, లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులనే గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్‌లు పెదిరెడ్డి సత్యసాయిరాం,రెడ్డి నాగవేణికుమారి, నాయకులు ఇందల వీరబాబు, చవ్వాకుల కృష్ణబాబు, పెదిరెడ్డి బాబీ, గంగుమళ్ల శ్రీను పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ

అనపర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి ప్రభుత్వాసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన అనపర్తి ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి వార్డును తనిఖీ చేశారు. బాలింతలను పలుకరించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో రూ.13 కోట్లతో భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం మాదిరి ఎవరినీ చందాలు అడుగకుండా అభివృద్ధి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, అన్నవరం పాల్గొన్నారు.

సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీఎస్ఈఏ) జిల్లా నూతన కమిటీ ఎన్నికలు సోమవారం రాజమహేంద్రవరంలో జరిగాయి. ఈ ఎన్నికలకు అధికారిగా రౌతు రామకృష్ణ, ఉప ఎన్నికల అధికారిణిగా రమాబాయి వ్యవహరించారు. అధ్యక్షుడిగా తాళ్లపూడి మండల సర్వేయర్ పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సర్వేయర్ కేవీవీ రవికాంత్, కార్యదర్శిగా కాతేరు-3 (వీఎస్) ఎస్.సత్యనారాయణ, ఉప కార్యదర్శిగా వెదురుపాక విలేజ్ సర్వేయర్ వై.గంగరాజు, కోశాధికారిగా దూబచర్ల-1(వీఎస్) జి.వెంకటేష్, మరో ఆరుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సంఘం శ్రేయస్సుకు నిష్పక్షపాతంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల కార్యవర్గ సభ్యులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార గ్రంథం భగవద్గీత

గీతా జయంతిలో జ్యోతిష్య సంస్కృతాంధ్ర పండితుడు సుబ్రహ్మణ్యశర్మ


సరస్వతీ ఘాట్‌లో రమాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు పరిష్కారం చూపే గ్రంథం భగవద్గీత అని ప్రముఖ జ్యోతిష్య సంస్కృతాంధ్ర పండితుడు ప్రభల సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. గీతా జయంతి సందర్భంగా స్థానిక శ్రీరామ్‌నగర్ శ్రీ దువ్వూరి రామకృష్ణారావు ట్రస్ట్ సభా మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభల మాట్లాడుతూ ప్రపంచంలో మానవాళి సమస్యా పరిష్కారానికి భగవద్గీతను మించిన గ్రంథం లేదన్నారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీత బోధించినప్పటికీ ఇది సామాన్య మానవులను దృష్టిలో ఉంచుకుని చెప్పిందన్నారు. అనంతరం ప్రభలను ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకరశర్మ సత్కరించారు. కార్యక్రమంలో చాగంటి నరసింహారావు, సత్యమూరి, ఎం.రామకృష్ణారావు, నల్లగొండ రవిప్రకాష్, సావిత్రి దంపతులు, దినవహి నాగసాయి పాల్గొన్నారు. స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సంస్కృత విభాగాధ్యక్షురాలు ప్రభల శ్రీవల్లి మాట్లాడుతూ భగవద్గీతను చదవడమేగాక దానిని జీవితంలో అన్వయించుకుంటే రోజువారీగా మనకు ఎదురయ్యే అనేక సవాళ్లను సులభంగా అధిగమించగలమన్నారు. గీతా పారాయణం అనంతరం విద్యార్థినులకు గీతాపారాయణం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. గోదావరి ఆశ్రమం ఆధ్వర్యంలో సరస్వతీ ఘాట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవద్గీత పఠనంపై మైసూరు దత్తపీఠం స్వామిజీ గణపతి సచ్చిదానంద ఆధ్వర్యంలో బంగారు పతకాన్ని గెలుచుకున్న ప్రయాగ రమాదేవికి గీతా పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో జ్ఞాన సరస్వతీ పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు, మాదిరాజు శ్రీనివాస్, మంచిరాజు హేమలత, కళారత్న పీవీఎస్ కృష్ణారావు, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథ ఉత్సవం



రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సోమవారం శ్రీరంగనాథ ఉత్సవం వైభవంగా జరిగింది. జ్యోతిష వాచస్పతి తాడి కోదండరామ్, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక గంటాలమ్మ గుడివీధిలోని సీతమ్మ సందు నుంచి ఊరేగింపు ప్రారంభమై జెండా పంజా రోడ్డు, కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కోలాటాలు, భజనలతో వంకాయల వారి వీధిలో అష్టలక్ష్మి ఆలయంలో శ్రీరంగనాథస్వామి క్షేత్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు దర్శించుకున్నారు. ఈ ఉత్సవాన్ని జ్యోతిష్య ఆచార్య తాడి కేదారనాథ్ పర్యవేక్షించారు.

రిటైర్డ్ హెచ్‌సీకి సత్కారం

రాజమహేంద్రవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన కడలి నీలభద్రరావు(ఏఆర్‌హెచ్‌సీ 3118)ను ఎస్పీ నరసింహ కిషోర్ సోమవారం సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నీలభద్రరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ కిషోర్

గోశాలకు విరాళం

కడియం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోశాల సంరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గోశాలకు టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి-రాజరాజేశ్వరి దంపతులు రూ.25 వేల విరాళాన్ని సోమవారం బాధ్యత సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో అయితిరెడ్డి అయ్యప్ప, గణేశుల చక్రవర్తి, పున్నమిరాజు వీర్రాజు, కుసునూరి బాబులు, మర్రి చంద్రరావు, పడాల గోవిందు, పిండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న రైతు కూలీ సంఘం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రంగపేట మండలం సింగంపల్లిలో సీపీ రెడ్డి నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సింగంపల్లిలో సుమారు 12 ఎకరాల సీలింగ్ భూమిలో 200 మంది ఇళ్ల నిర్మించుకుని సీపీ రెడ్డి నగర్‌గా నామకరణం చేసుకొని 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. సదరు కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి పట్టాలు మంజూరు చేయాలని, రహదారులు, డ్రైనేజీలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజ బాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం(స్త్రీ విముక్తి) నాయకులు రెడ్డి దుర్గాదేవి, చెక్క సత్తిబాబు, రాయుడు కన్నారావు, ద్రాక్షావల్లి, సీతారాం, రత్నం పాల్గొన్నారు.

రాపాక సొసైటీ చైర్మన్‌గా సత్యనారాయణ

సీతానగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నాగారపు సత్యనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేసి చైర్మన్‌తో పాటు డైరెక్టర్లుగా ముత్యాల గోవిందరాజు, సింహాద్రి వీర భాస్కరరావులతో ప్రమాణం చేయించి వారిని అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక చెరుకూరి వారి తోటలో ఆదివారం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కొక్కిరి శ్రీకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో ల్యాబ్ టెక్నీషియన్స్ చాలా ప్రాధాన్యముందని, వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి 800 మంది ల్యాబ్ టెక్నీషియన్స్ హాజరయ్యారు.

అంగుళూరులో ఆటో బోల్తా

క్షతగాత్రులకు జీజీహెచ్‌లో చికిత్స

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గండిపోచమ్మ గుడికి వెళ్లి వస్తూ ఆదివారం రాత్రి అంగుళూరు వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన ముగ్గురికి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్య చికిత్స అందించారు. పాలకొల్లుకు చెందిన సురేష్, జీవరాజు, వర ప్రసాద్‌లకు తలకు, చేతులకు గాయాలు కావడంతో వైద్యసేవలందించినట్టు వైద్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం జేగురుపాడు ఏజీఎల్ ఫీడర్‌కు విద్యుత్ ఉండదని ఆ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా కడియపుసావరం, జేగురుపాడు గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల తరువాత సరఫరా చేయబడుతుందన్నారు.

బిక్కవోలులో ఏకాహం

బిక్కవోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6గంటలకు ఏకాహం ప్రారంభించారు. ముందుగా సుబ్రహ్మణ్యస్వామి మాలధారులు భజనలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6గంటల వరకూ నిరాటంకంగా ఈ ఏకాహంలో 8 భజన బృందాలతో కార్యక్రమాలు జరుగుతాయని, సాయంత్రం మహాన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామని పేర్కొన్నారు.

బిక్కవోలు జీఎస్‌డబ్ల్యుఎస్‌గా మునేశ్వరరావు

బిక్కవోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ అధికారిగా(డిప్యూటీ ఎంపీడీవో) వై.మునేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై బిక్కవోలు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.శ్రీ నివాస్, ఏవో నాగేంద్ర ఆయనను అభినందించారు.

మహానటి సావిత్రి జయంతి ఉత్సవాలు

రంగంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఆర్టీసీ పెట్రోల్ బంకు పక్కన సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్యకాపు ఆధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముందుగా సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరిడియ్య మాట్లాడుతూ సావిత్రి 1936 డిసెంబరు 6న గుంటూరులో జన్మించారని, ఆమె పుట్టి 89 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆమె జయంతి వారోత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబరు 1వ తేది నుంచి ప్రారంభిస్తున్న సందర్భంగా రంగంపేట మండలంలోని సావిత్రి అభిమానులు కూడా వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. సావిత్రి మొదటిసారిగా 1950లో 'సంసారం' సినిమాలో నటించారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సావిత్రి అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆంధ్ర కింగ్ తాలూకా
సూర్యమినీ	: జూటోపియా-2
సూర్యప్యాలస్	: రివాల్వర్ రీటా
స్వామి	: బిజినెస్‌మేన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: 12 ఎ రైల్వే కాలనీ
శివజ్యోతి	: ఆంధ్ర కింగ్ తాలూకా
రాజా	: ఇట్లు మీ ఎదవ
ఊర్వశి	: రాజు వెడ్స్ రాంబాయి
మేనక	: ది గర్ల్ ఫ్రెండ్
రంభ	: ఆంధ్ర కింగ్ తాలూకా
అప్సర	: తేరీ ఇష్క్ మే
అశోక	: ఆంధ్ర కింగ్ తాలూకా
వీఎస్ మహల్(నామవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
వెంకటసూర్య(కడియం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
సత్యగౌరి (అనపర్తి)	: ఆంధ్ర కింగ్ తాలూకా
సూర్యశ్రీ (అనపర్తి)	: రాజు వెడ్స్ రాంబాయి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: బిజినెస్‌మేన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఆంధ్ర కింగ్ తాలూకా
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
శ్రీనివాస (గోకవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: రాజు వెడ్స్ రాంబాయి
లలితామహల్(రంపచోడవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
నవయుగ(చింతూరు)	: ఆంధ్ర కింగ్ తాలూకా







సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

రేపు సీఎం చంద్రబాబు నల్లజర్ల రాక

- 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లు పరిశీలించిన 'తూర్పు' కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే వెంకట్రాజు, సమన్వయకర్త పెందుర్తి

రాజమహేంద్రవరం/నల్లజర్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 3వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో కలసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ బుధవారం సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చకచకాచేయాలని, పర్యటన విజయవంతం చేయాలన్నారు. ప్రొటోకాల్, భద్రత, సభా ప్రాంగణం, ప్రజా వేదిక, హెలిప్యాడ్, రవాణా అండ్ పార్కింగ్, స్టాల్స్, రైతులతో సీఎం ముఖాముఖి వంటి ఏర్పాట్లపై విభాగాల వారీగా సూచనలు చేశారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, ముఖ్యంగా రైతుల కోసం వస్తున్నారని, అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా నల్లజర్ల బైపాస్ సమీపంలో ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు సెట్స్ వద్ద సభ స్థలాన్ని ఏర్పాటుచేశారు. ఉద్యాన పంట అయిన ఆయిల్ పాం గెలల కోత, గిట్టుబాటు ధరలపై స్థానిక రైతులతో సీఎం మాట్లాడతారు. అలాగే వరి రైతులు, కూరగాయల రైతులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం పది గంటలకు చంద్రబాబు చేరుకుంటారని సమాచారం. ఈ కార్యక్రమం తర్వాత కేడర్‌తోనూ భేటీ ఉంటుంది.



రబీకి రెడీనా..

వ్యవసాయ సీజన్.. మారుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎప్పుడు నారుమళ్లు వేయాలి, ఎప్పుడు ఊడ్పులు చేయాలి, పంట చేతికొచ్చేది, మాసూళ్లు ఎప్పుడు పూర్తవుతాయో ఒక లెక్క ఉండేది. వాతావరణ మార్పులు, తుఫాన్ల దెబ్బకు ఈ సీజన్‌లు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ నెలాఖరుకి రబీకి నాట్లు పడాలి. కానీ వరి కోతలు ఇంకా సాగుతున్నాయి. పది రోజుల దాకా కొనసాగే పరిస్థితి ఉంది. మరి రబీ నాట్లు ఎప్పుడు పూర్తవుతాయి. కచ్చితంగా ఆలస్యమవుతాయని చెప్పొచ్చు.

- పూర్తికాని ఖరీఫ్ మాసూళ్లు
- 31లోపు రబీ నాట్లు పూర్తంటే ఎలా
- తూర్పు డెల్టాకు నీరు విడుదల
- సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు ఎప్పుడో
- ఖరీఫ్ రైతును వెంటాడుతున్న వానలు
- ఈనెల 15వ తేదీలోపు ఖరీఫ్ ఒబ్బిడి
- ఇప్పటికే 2 లక్షల 10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో 8.96,507 ఎకరాల్లో రబీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని మూడు డెల్టాల పరిధిలోని వరిసాగు ఒక పద్ధతిలో సాగడంలేదు. పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకూడదంటే ముందుగానే పంట సాగు మొదలుపెట్టాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. గతంలో మే నెలలోనే నారుమళ్లకు సిద్ధం చేసుకుని, జూన్ నెలలో నాట్లు మొదలు పెట్టేవారు. కొన్నేళ్ల నుంచి ఈ క్రమం తప్పింది. బాగా ఆలస్యం అవుతోంది. డిసెంబరు నెల వచ్చేసినా వరి కోతలు ఇంకా పూర్తికాలేదు. తూర్పుగోదావరి జిల్లాలో మూడు వంతులకుపైగా జరిగినా, మిగతా జిల్లాల్లో వరి మాసూళ్లు పూర్తికాలేదు. ఈ పరిస్థితుల్లో రైతుల ధాన్యం ఇంకా కొంత వరకూ కళ్లాలలోనూ, రోడ్లమీద ఆరబోతలోనూ, రాశులుగానూ ఉంది. దిత్వా తుఫాన్ వల్ల ప్రస్తుతం కోతలు ఆపేసినా, ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో చాలావరకూ ధాన్యం కొనుగోలు జరుగుతోంది. సోమవారం నాటికి జిల్లాలో 29,164 మంది రైతుల నుంచి 2,21,036 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 20,225 మంది రైతులకు రూ.340.70 కోట్లు జమచేశారు. ఇది మంచి పరిణామమే. కానీ రబీ సాగు విషయంలో ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల్లో సోమవారం నుంచే రబీ ప్రారంభమైనట్టు చెబుతూ, ఈనెలాఖరు నాటికి నాట్లు కచ్చితంగా పూర్తి కావాలని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. సంక్రాంతి తర్వాత వరకూ కూడా రబీ సాగు కొనసాగే పరిస్థితి ఉంది. ఇక ఫిబ్రవరి 1 నుంచి సాగునీటిని వంతుల వారీగా అమలుచేయడానికి నిర్ణయించారు. వచ్చే ఏడాది మార్చి 31కి రబీ సాగు పూర్తి చేయాలనేది నిర్ణయం.



బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు

• 93.26 టీఎంసీల నీరు అవసరం

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే నీటితో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ, డెల్టాలకు సంబంధించి ఈ రబీలో 8,96,507 ఎకరాల్లో వరిపంట సాగుచేయనున్నారు. అందులో తూర్పుడెల్టా, పీబీసీ పరిధిలో 2,64,507 ఎకరాలు, గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో 1,72,000 ఎకరాలు, పశ్చిమ డెల్టా పరిధిలో 4,60,000 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంటుంది. దీనికోసం 93.26 టీఎంసీల సాగునీరు అవసరం. అయితే అంతనీరూ అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. మార్చి 31వ తేదీకి పూర్తవ్వాలని అధికారులు చెబుతున్నా, ఇతర ప్రాంతాల వారు మాత్రం ఏప్రిల్ 15వ తేదీ వరకూ నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

• తూర్పు డెల్టాకు నీరు విడుదల

రబీసాగు కోసం తూర్పు డెల్టాకు సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేశారు. కానీ ఇంకా సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయలేదు. సోమవారం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు సమక్షంలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ శ్రీనివాస్, డిఈరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలోని సుబ్బారావుపేటలో సోమవారం వృద్ధాప్య పింఛను అందజేస్తున్న సందర్భంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

జిల్లాలో 93.89% పింఛన్లు పంపిణీ

- ఉదయం పదికే 80 శాతం పూర్తి

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం ఉదయం నుంచే మొదలుపెట్టారు. దాదాపు 4 వేల మంది సచివాలయ తదితర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. దీంతో ఉదయం పది గంటల సమయానికే 80 శాతం పంపిణీ పూర్తయింది. సాయంత్రం ఎనిమిది గంటలకు 93.89 శాతం పూర్తి చేశారు. మొత్తం 2,34,520 మంది లబ్ధిదారులకు రూ.102 కోట్ల 70 లక్షల 42వేల 500 అందజేయాల్సి ఉండగా.. తొలి రోజున 2,20,181 మందికి రూ.96 కోట్ల 12 లక్షల 91వేల 500 అందజేశారు. ఈనెల పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరంఅర్బన్, గోపాలపురం, నిడదవోలు ఉన్నాయి. కాగా బయోమెట్రిక్ లేదా ఐరిష్ గుర్తింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా పెన్షన్ పంపిణీ అధికారులు బయోమెట్రిక్ నిర్ధారణ ద్వారా డబ్బులు అందజేస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పింఛను అందలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, చివరి లబ్ధిదారు వరకూ పింఛను కచ్చితంగా అందుతుందని చెప్పారు. కాగా రాజమహేంద్రవరం నగరంలోని గాంధీపురం-1లోని సుబ్బారావుపేటకు చెందిన నామాల రమాయమ్మ(78) ఇంటికి కలెక్టర్ వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఆర్ఎంసీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు

- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- రాజమహేంద్రవరంలో ప్రపంచ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ



రాజమహేంద్రవరంలో ఎయిడ్స్‌డే అవగాహన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి.. ర్యాలీలో విద్యార్థినులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, వారితో ఆప్యాయంగా గౌరవంతో వ్యవహరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. డిసెంబరు 1 ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాల వరకూ నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ టెస్టింగ్ సంఖ్యను గణనీయంగా పెంచామని, తొలి దశలోనే పరీక్షలు చేయించుకుంటే వైరస్ వ్యాప్తిని నివారించడం పూర్తిగా సాధ్యమవుతుందని అన్నారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్ఐవీ టెస్టులు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, గర్భిణీల నుంచి శిశువులకు వ్యాధి సోకకుండా నిరోధించడంలో గణనీయమైన పురోగతి సాధించామని, పాజిటివ్ శిశువుల కేసులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ జువైనల్ హోంలలో ఎక్కువ మంది సింగిల్ పేరెంట్ చిల్డ్రన్ ఉండడం ఆందోళనకరమని అన్నారు. పిల్లల్లో నేర ప్రవృత్తిని తల్లిదండ్రులు ముందుగానే గుర్తించి వారిని సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ సందర్భంగా రెడ్ బెలూన్లను ఎగుర వేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, దిశ సంస్థ క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన రంగోలీ, పోస్టర్ ప్రదర్శన, రీల్స్ మేకింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా హెచ్ఐవీ పాజిటివ్ బాధిత పిల్లలకు, పెద్దలకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు.



సెల్ఫీ తీస్తున్న డింపుల్, ఆషిక

హీరోయిన్ల సందడి

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో విడుదల కాబోతున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంలోని బెల్లబెల్ల పాటను చిత్ర బృందం సోమవారం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఆ సినిమా దర్శకుడు కిషోర్ తిరుమల, హీరోయిన్ ఆషిక రంగనాథ్, మరో హీరోయిన్ డింపుల్ హయాతి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి హీరోయిన్లు డాన్స్ చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జీజీయూ వైస్‌చాన్సలర్ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరిస్తున్న జేసీ మేఘాస్వరూప్.. జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కిషోర్

ప్రతి అర్జీ నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలి!

- జేసీ మేఘాస్వరూప్
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీ నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 178 అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో రెవెన్యూ శాఖకు 87, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు 39, పోలీసు శాఖకు 12, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్ మాట్లాడుతూ అధికారులు పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. వచ్చిన ప్రతీ అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని ఆదేశించారు.

ఎస్పీకి 33 ఫిర్యాదులు అందజేత

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి 33 అర్జీలను స్వీకరించారు. త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కలెక్టరేట్‌లో సాయుధ దళాల ఫ్లాగ్ డేకి విరాళం అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

సాయుధ దళాల ఫ్లాగ్‌డేకి స్వచ్ఛందంగా విరాళాలు అందించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న సాయుధ దళాల ఫ్లాగ్ డే సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారికి కలెక్టర్ స్వయంగా తన విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది విరాళాల సేకరణలో డ్వాక్రా మహిళలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా అలాగే సహకరించాలన్నారు. ఈ నిధులను అమరవీరుల కుటుంబాలు, వికలాంగులైన సైనికులు, రెండో ప్రపంచ యుద్ధ సైనికులు, వితంతువులు, మాజీ సైనికుల సంక్షేమానికి వినియోగిస్తారని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జడ్పీ బ్యాంచ్, కాకినాడ, ఖాతా నెం.62064060623, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0020974 పేరిట డిమాండ్ డ్రాఫ్టు/చెక్కు రూపంలో అందజేయవచ్చని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్‌కే నవాబ్ జాన్ సాహెబ్ తెలిపారు. ఈ ఏడాది డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలు జెండా దినోత్సవ నిధికి రూ.10 చొప్పున విరాళం అందించారని కలెక్టర్ గుర్తుచేశారు. దీంతో ఆ నిధి సేకరణలో జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పుడు కూడా అదే చొరవ చూపాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్ఈడీ సీఈవో జగపతి

డ్వాక్రా మహిళలు జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలి

మహిళలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయ సంఘాల మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని జడ్ఈడీ సీఈవో జగపతి ఆకాంక్షించారు. చిన్న పరిశ్రమల స్థాపనలో భాగంగా మండలంలోని మహిళా వ్యాపారవేత్తలకు రాజానగరంలోని సెర్ప్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్న పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు బ్యాంకు రుణాలు మంజూరుతో పాటు జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ సర్టిఫికెట్ అందిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా వ్యాపారవేత్తలుగా రాణించి, కుటుంబ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో కోఆర్డినేటర్ హేమంత్, సెర్ప్ ఏపీఎం సునీత, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు : ఎమ్మెల్యే మద్దిపాటి

కూటమి ప్రభుత్వంపై బురద చల్లటం పద్ధతి కాదు : ఎమ్మెల్యే ముప్పిడి 8

పాఠశాలకు కుర్చీల బహూకరణ

పెరవలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ కుమార్, ఆయన మిత్రులు కే. ప్రసాద్ కలిసి కుర్చీలు బహూకరించారు. సుమారు నాలుగు వేల రూపాయలు విలువైన ఆరు ప్లాస్టిక్ కుర్చీలను హెచ్‌ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస చక్రవర్తి వారిని అభినందించారు.

దుర్గాప్రసాద్‌కు బెస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న దుర్గాప్రసాద్

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వి. దుర్గాప్రసాద్ బెస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లాలోని ఐసీటీసీ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి అవార్డులు అందజేశారు. దీనిలో భాగంగా దుర్గాప్రసాద్‌కు టీబీ, ఎయిడ్స్, లెప్రసీ విభాగం జిల్లా అధికారి డా. ఎన్.వసుంధర, ఇతర అధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌కు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 7 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ - మీకోసం)లో ఏడు ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వివిధప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారంలో నూటికి నూరుశాతం నాణ్యతతో పాటు పూర్తి స్పష్టత ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా వెంకన్న కల్యాణం



దేవరపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీటలపై సూతాపల్లి రామారావు దంపతులు కూర్చోనగా, ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు వేదమంత్రాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు మోదుగమూడి చిన వెంకటేశ్వరరావు

దేవరపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి పంట కాల్వలోకి దూసు కెళ్లడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన మోదుగమూడి చిన వెంకటేశ్వరరావు (29) తెల్లవారుజామున 5 గంటలకు తన గ్రామం నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గమధ్యలో కృష్ణంపాలెం వద్ద ఆరు గంటలకు చిన్నపాటి వర్షం పడటంతో మోటార్‌సైకిల్ అదుపు తప్పి పక్కన ఉన్న పంటకాల్వలో దూసుకెళ్లడంతో తలకు కాళ్లకు తీవ్రగాయాలవడం, అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈయన కొవ్వలిలో ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రాజమహేంద్రవరం రైల్వే ఉద్యోగానికి సంబంధించి పరీక్ష రాసేందుకు వెళ్తుండగా కృష్ణపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నయ్య మోదుగమూడి రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

● కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్ ● పలుచోట్ల విద్యార్థుల ర్యాలీలు



కొవ్వూరు పట్టణంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది



నిడదవోలులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



పెరవలి : కానూరులో ఎయిడ్స్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, తదితరులు

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలడానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి విజయవిహార్ సెంటర్ వరకు వైద్య సిబ్బంది ప్లకార్డులు ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్.సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ వి.దుర్గాప్రసాద్, ఆసుపత్రి, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎన్ కళాశాలలో ...

హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ (హెచ్ఐవి) రోగ నిరోధక వ్యవస్థపై దాడి చేసే వైరస్ అని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగరావు డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వై. రమేష్ అన్నారు. సోమవారం ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీకి చికిత్స చేయకపోతే అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిషియన్సీ సిండ్రోమ్ (ఎయిడ్స్)కు దారి తీస్తుందన్నారు. సరైన వైద్య సంరక్షణతో హెచ్ఐవీని ఎయిడ్స్ దశకు చేరకుండా నివారించవచ్చునన్నారు. హెచ్ఐవీని పూర్తిగా నయం చేయడానికి చికిత్స అందుబాటులో లేదని, యాంటీరెట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టి) వంటి మందులతో వైరస్‌ను సమర్థవంతంగా నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. జ్యోతి అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు తాము చైతన్యం పొందుతూ ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ. నాగేశ్వరరావు, ఎం. పద్మజ, డాక్టర్ కె.ప్రభాకరరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం కానూరు ప్రాథమిక ఆరోగ్యంకేంద్రం పరిధిలో పెరవలి మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి. తేజస్వి పాల్గొని ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. సర్పంచ్ భావన మధు, ఆరోగ్య సిబ్బంది రాజమోహన్, ఆశాజ్యోతి, నాగేశ్వరరావు, లయన్స్‌క్లబ్ సెక్రటరీ సలాది ఉదయ భాస్కరరావు, బూరుగుపల్లి రాజు, కోలా సీతయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు : ఎమ్మెల్యే



నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, కాకర్ల రామతులసి



నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, వేముల నాగరాజు



నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు, షైక్‌మాబు



నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, తామా పెదదుర్గారావు

గోపాలపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతిఒక్కర్నీ తగిన సమయంలో పార్టీ గుర్తించి గౌరవిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ టీడీపీలో గ్రామస్థాయి నుంచి అనుబంధ సంఘాల నియామకాల ప్రక్రియను దశల వారీగా పూర్తి చేశామని తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గ స్థాయి అనుబంధ కమిటీల నియామకాలు జరిపామన్నారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడిగా చిన్నాయిగూడెంకి చెందిన శ్రీఅబ్బిన సురేంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడిగా కరిచర్లగూడెంకి చెందిన వేముల నాగరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా తెలికిచర్లకి వీరమళ్ల సురేశ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా రాజంపాలెంకు చెందిన కాకర్ల రామతులసి, వాణిజ్య విభాగం అధ్యక్షునిగా ద్వారకాతిరుమల మండలంకు చెందిన ఇమ్మని రత్నాజీ, ఎస్టీసెల్ అధ్యక్షునిగా సంజీవపురానికి చెందిన తామా పెదదుర్గారావు, తెలుగు యువత అధ్యక్షునిగా మారంపల్లికి చెందిన పాతూరి సహృదయ్, ఐటీడీపీ అధ్యక్షునిగా ప్రకాశరావుపాలెంకు చెందిన కొత్తపల్లి భరత్‌కుమార్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడుగా త్యాజంపూడికి చెందిన ఆదిరెడ్డి రాంబాబు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షునిగా కొలూరికి చెందిన పెనుమాక రాజ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షునిగా దొరసానిపాడుకు చెందిన అక్కా బత్తులు రమేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా దొండపూడికి చెందిన షైక్ మాబు, సాంస్కృతిక విభాగాధ్యక్షునిగా దూబచర్లకు చెందిన చెరుకూరి వెంకటరామారావు, న్యాయ సేవా విభాగం అధ్యక్షునిగా నల్లజర్లకు చెందిన జేమ్స్ కిన్నెడి కొపెల్లా, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షునిగా గుణ్ణంపల్లికి చెందిన ఆలపాటి వెంకట సాయి యశ్వంత్‌ను నియోజకవర్గస్థాయి ఆయా విభాగాల అధ్యక్షునిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశామన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజామన్ననలు పొంది పార్టీకి మంచి పేరు తీసుకురావాలన్నారు.

చాగల్లులో 95 శాతం పెన్షన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. ఇందులో అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమం, బీసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కూటమి నాకులు పాల్గొని పంపిణీ చేశారు. అలాగే నెలటూరులో టీడీపీ నాయకులు యడ్లపల్లి రకారావు, తాళ్ళూరి ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరుల చేతుల మీదుగా అందజేశారు. ధారవరంలో బొడ్డు రాజు, కేశవకుమార్, తదితరులు పాల్గొన్నారు. చిక్కాలలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెన పెంటారావు, సొసైటీ అధ్యక్షుడు వై. అబ్బులు చౌదరి, తదితరులు పాల్గొన్నారు. మండలంలో 95 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక లక్షపత్రి పూజ



చాగల్లులో పూజను నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగల్లు సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్టి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. 23వ వార్షిక లక్షపత్రి పూజ కార్యక్రమం సోమవారం జరిగింది. స్వామివారు అమ్మవార్లకు ఏకాదశి రుద్రాభిషేకము, లక్ష బిల్వార్చన, సూర్య నమస్కారములు, సుబ్రహ్మణ్య హోమం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, తదితర పూజలు జరిగాయి. వేదపండితులు, పండిత పురోహితులు మంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలవడం ఎంతో గర్వకారణం

● ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేరీ సుజాత



నిడదవోలు వజ్రోత్సవ వేడుకల్లో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నిడదవోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకల్లో వివిధ పోటీల్లో ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలవడం కళాశాలకు ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ బి. మేరీ సుజాత అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వజ్రోత్సవ పోటీల్లో విజేతలైన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవరుచుకోవాలన్నారు. తద్వారా వారిలోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బీ. ఏసురత్నం, అధ్యాపకులు కుమారస్వామి, బాలకృష్ణ, మురళి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

పెరవలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యాధికారి రాజనాల ప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అజ్జరంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు హిమోగ్లోబిన్ శాతం, పలుపరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ సాధారణ వైద్యపరీక్షల్లో ఏమైనా తేడాలు కనిపిస్తే అటువంటి పిల్లలను గుర్తించి వారిని రాజమండ్రిలోని కేంద్రానికి రిఫర్ చేస్తామన్నారు. వైద్య సిబ్బంది సిర్రారూపవతి, వెంకటలక్ష్మి ఉన్నారు.

సామాజిక పింఛన్లతో ఆర్థిక భరోసా : చైర్మన్



నిడదవోలులో పింఛన్లు అందిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రంగా రమేష్, సొసైటీ అధ్యక్షులు పెనుమచ్చ చందు, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు

ఉండ్రాజవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ప్రభుత్వం పింఛన్లు అందజేస్తున్నట్టు ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. సోమవారం వెలగదుర్రు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శేషారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ పింఛన్లు పేదలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లుశేషారావు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలింకి జిన్నాబాబు, తహశీల్దార్ వీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వెలగదుర్రులో పింఛన్లు పంపిణీ చేస్తున్న శేషారావు

కూటమి ప్రభుత్వంపై బురద చల్లటం పద్ధతి కాదు

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వ రరావు ● పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

తాళ్లపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై బురద చల్లటం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వ రరావు తీవ్రంగా స్పందించారు. సోమవారం మలకపల్లి, పెద్దేవంలో పీఎం ఏజీవై నిధులు, మండల పరిషత్ నిధులు రూ.56.25 లక్షలతో డ్రైన్ల పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ ఏఏ పనులకు ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు తీర్మానం చేశారో ఆయా పనులన్నింటినీ పూర్తి చేయాలని, అలాగే తీర్మానాలు లేని పనులకు తీర్మానం చేసిన తరువాత మాత్రమే చేయాలన్నారు. అనంతరం నూతనంగా మం జూరు అయిన 20 మంది లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. తర్వాత మలకపల్లిలో ఎమ్మెల్యే ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన 2,43,300 రూపాయల విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరాం చౌదరి, సిద్దా దుర్గారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రేకపల్లి మంగామణి, రాపాక రాజేశ్వరి, మద్దిపాటి రామారావు, కోడి శంకరం, ఎంపీటీసీ వీరా హరిబాబు, తిగిరిపల్లి గోపి, కల్లూరి సుబ్రహ్మణ్యం, బోడపాటి గంగరాజు, యువగళం నాయకులు కూచిపూడి గణపతి ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఆర్ఐ సాహిత్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జహాన్, ఏపీఎం మంగాయమ్మ, ఏపీవో రమాదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి శ్రీహర్షకు నేషనల్ అవార్డు

తాళ్లపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటకి చెందిన గుమ్మడి చంద్రశేఖర్ కుమారుడు గుమ్మడి శ్రీహర్ష లక్నోలో జరిగిన భారత స్కౌట్స్ అండ్ జంబోరేలో నేషనల్ కాంపిటీషన్‌లో పాల్గొని అవార్డు సాధించాడు. ఈ విద్యార్థి న్యూ ఆరుగొలను బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ పాఠశలలో తొమ్మిది మంది విద్యార్థులకు అవార్డులు రావడంతో పలువురు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఇబ్బందులున్నా... సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత

● మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



తీపర్రులో పింఛన్ అందజేస్తున్న శేషారావు

పెరవలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. తీపర్రులో సోమవారం పలువురికి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వెయ్యి రూపాయలు పెంచడానికి నాలుగేళ్ల సమయం పడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఒకే సారి రూ. నాలుగు వేలు చేసిందన్నారు. అలాగే రైతులు, మహిళలు, విద్యార్థులకు వివిధ రకాల పథకాలను అమలు చేస్తోందన్నారు. తర్వాత పాలూరు, పెరవలి, కాకరపర్రు, ఖండవల్లి, ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయనతో పాటు ఎంపీడీవో ఉమారాజ్యలక్ష్మి, తహశీల్దార్ నిరంజన్, కూటమి నేతలు అతికాల శ్రీను, పిప్పర రవి, కంటిపూడి సూర్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా గీతా జయంతి



కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులు



తాళ్లపూడి గీతామందిరంలో లక్షతులసీ పూజ నిర్వహిస్తున్న వేదపండితుడు గంగాధర శర్మ



గోపాలపురంలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న కల్యాణీప్రసాద్

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు భగవద్గీత సమాధాన ప్రమాణంగా నిలుస్తుందని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై.రమేష్ అన్నారు. కొవ్వూరు ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు, సంస్కృత విభాగాల ఆధ్వర్యంలో సోమవారం గీతా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత గ్రంథాలకు పూజలు చేసి శ్లోకాలు పఠించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్ మాట్లాడుతూ కురుక్షేత్ర మహా సంగ్రామంలో నిస్సహాయస్థితిలో ఉన్న అర్జునుడికి శ్రీకృష్ణుడు జీవిత తత్వశాస్త్రం, కర్మ, మోక్షం వంటి విషయాలను వివరించి, కర్తవ్య నిర్వహణకు మా ర్గనిర్దేశం చేసిన రోజు అన్నారు. భగవద్గీత అర్జునుడికే కాదు కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు, సందిగ్ధతకు సమాధానంగా నేటి ఆధునిక యుగంలోను ప్రమాణంగా నిలుస్తుందన్నారు. గీతా సారాంశంలో నిష్కల్మషంగా మనం చేయవలసిన పనిచేస్తూ ఫలితాన్ని ఆశించకుండా మన ప్రయత్నం చేయాలని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయరామలక్ష్మి, నూకరత్నం భగవద్గీత విశిష్టతను వివరించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రపంచ వ్యాప్తంగా విశ్వ మానవ శ్రేయస్సు, సౌభ్రాతృత్వాన్ని ఆశించే లక్ష్యం కలిగిన అత్యుత్తమ పవిత్ర గ్రంథం భగవద్గీత అని టీటీడీ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జి ఓరుగంటి నరసింహయోగి అన్నారు. సోమవారం గీతా జయంతి వేడుకల్లో భాగంగా తాళ్లపూడి ఇస్కాన్ శ్రీల ప్రభుపాద భజన కుటీర్ సభ్యులు నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం తాళ్లపూడి ఇస్కాన్ ప్రతినిధి శ్యామాంగ శ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో శ్రీల ప్రభుపాద భజన కుటీర్‌లో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి, మహిళలకు మూడు విభాగాలుగా పోటీలు నిర్వహించి తొమ్మిది మంది విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా పరస రాధాకృష్ణ, సంకర్షణ సురేష్‌దాస్, బలభద్ర సుందరదాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి రాధాగోపినాథ్ గీతామందిరంలో గీతాజయంతి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహికంగా 18 అధ్యాయాలతో కూడిన భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాయికృష్ణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపాటి పూర్ణచంద్ర కళావతి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: సామాన్య ప్రజానీకానికి సైతం జ్ఞానాన్ని అందించేది ఒక భగవద్గీత మాత్రమేనని ఇస్కాన్ భగవద్గీత పాఠశాల లేర్న్ గీతా, లివ్ గీతా, మెంటార్ వెలగా కల్యాణీప్రసాద్ అన్నారు. గీతాజయంతిని పురస్కరించుకుని వాదాలకుంట, గోపాలపురంలో సోమవారం భగవద్గీత వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటర్ కల్యాణీప్రసాద్ మాట్లాడుతూ దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు మానవాళికి దిశనిర్దేశం చేయడానికి అర్జునుడిని మాధ్యమంగా ఉంచాడన్నారు. కార్యక్రమంలో మీనాక్షి, రుక్మిని, బాలామణి, లలిత, కుసుమ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: గీతా జయంతి సందర్భంగా సోమవారం తాళ్లపూడి గీతా మందిరంలో వేద పండితులు జంధ్యాల గంగాధరశర్మ ఆధ్వర్యంలో లక్ష తులసీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యుడు బొర్రా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ గీతా జయంతి సందర్భంగా మూడురోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.